## (అంతర్వేదిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 31-1-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుని యొక్క గొప్పతనం మనకు తెలియాలి. భగవంతునిగురించి మనకు తెలిస్తే ఆయనలో ఐక్యమవ్వాలి అనే కాంక్ష కలుగుతుందిగాని లేకపోతే కలుగదు. భగవంతుడు చెప్పిన మాటలను శ్రద్ధగా శ్రవణంచేయాలి. శ్రవణం చేసి వదిలి వేయకుండా శ్రవణం చేసిన దానిని మననం చేయాలి. ఇలా చేయటంవలన ఆధ్యాత్మిక నిధి ఏర్పడుతుంది. మీరు సంపాదించిన డబ్బుమీద మీ మనస్సు ఎలా వెళ్ళి వాలుతోందో అలాగే మీరు శ్రవణం చేసి మననంచేసి సంపాదించుకొన్న జ్ఞానసంపదమీదమీమనస్సు వాలుతుంది. అంటే ఆధ్యాత్మికనిధి మీద మీకు ధ్యాస కలుగుతుంది. అప్పుడు మీ మనస్సు సంస్కరింపబడుతుంది. భౌతిక సంపదలు మీ శరీరం ఎంతకాలం ఉంటుందో అంతకాలం ఉంటాయి కాని ఆధ్యాత్మికసంపద మీ మరణానంతర జీవితంలో మీకూడా వస్తుంది.

నీ మనస్సులో చాలా మురికి ఉంది. మురికి ఎలాగుంది అంటే రాగంరూపంలో , భయంరూపంలో , క్రోధంరూపంలో , కామం రూపంలో ఉంది. ఆమురికిని తొలగించాలి. నీటిలో ఉన్న మురికిని వేరుచేస్తే నీరు స్వచ్ఛమవుతుంది. అదే విధంగా నీ మనస్సులో ఉన్న మురికిని తొలగిస్తే నీ మనస్సు స్వచ్ఛమవుతుంది. అయితే ఈ రాగాన్ని, భయాన్ని, క్రోధాన్ని, కామాన్ని విడిచిపెట్టటం అంత తేలికకాదు. నన్ను ఆశ్రయించు, నీ చిత్తాన్ని నాకు అర్పించు, నన్ను ఉపాసన చెయ్యి. అలాచేస్తే నన్నుపొందుతావు అని భగవంతుడు చెపుతున్నాడు. మన మనస్సు స్వచ్ఛమయితే, పవిత్రమైతే మనం దేవునికి దగ్గరవుతాము. భగవంతునిలో ఎంత పవిత్రత ఉందో అంత పవిత్రత మన మనస్సుకు పట్టిఇస్తే మన మనస్సు ఆత్మాకారం చెందుతుంది. అప్పుడు దేవుడు ఏ ఆనందమును, సుఖమును, శాంతిని అనుభవిస్తున్నాడో అదే మనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. ఇప్పుడు మనం ఆనందం కోసం సినిమాలు చూస్తున్నాము, T.Vలు చూస్తున్నాము, ఇలా అనేక పనులు చేస్తున్నాము. భగవంతుడు ఏ ఆనందస్థితిలో ఉన్నాడో ఆస్థితి మనకు వ్యక్తమయినపుడు ఇంక ఆనందం కోసం బయట తిరగవలసిన పని లేదు. మనం ఏపని చేసినా భగవంతుని అనుగ్రహానికి పాత్రులము అవ్వాలి. భగవంతుని అనుగ్రహానికి పాత్రులమయినపుడు మన కోరికతో సంబంధం లేకుండా ఆయన అంతట ఆయనే మనకు వక్తమవుతాడు.

నేను విగ్రహారాధన చేస్తున్నాను. విగ్రహారాధన చేయవచ్చునా అని అడిగితే నీవు ఎంతకాలమయితే దేహానికి పరిమితమై ఉన్నావో అంతకాలం విగ్రహాలను ఆరాధించవచ్చును. నీ హృదయంలో ఉన్న చావులేని వస్తువుతో నీకు తాదాప్యం లేదు. చనిపోయే ఈ దేహంతోటి, మాటమాటకు ఊగిసలాడే మనస్సుతోటి నీకు తాదాప్యం ఉంది. అందువలన నీవు విగ్రహారాధన చేయవచ్చును. ఈ దేహాన్ని నేను అని నీవు అనుకోవటం ఎంతనిజమో ఆరాయిని దేవుడు అనుకోవటం కూడా అంతే నిజం. పరమేశ్వరుని ఆరాధించగా, ఆరాధించగా ఆయన మన హృదయంలో ఉన్నాడు కదా ఆయన ఏమి చేస్తాడు అంటే వీడు మనలను ఆరాధిస్తున్నాడు, వీడికి నిజం తెలియటం లేదు అని ఆయన మనకు అత్యంత సన్నిహితంగా మన హృదయంలోనే వ్యక్తమవుతాడు. అజ్ఞానమును విడిచిపెడితే జ్ఞానము కలుగుతుంది. సంసారం అంటే నీ భార్య, పిల్లలు, ఇల్లుకాదు. నీ మనస్సే సంసారం. నీ అజ్ఞానమే సంసారం. నీ భార్యను, ఇంటిని విడిచిపెట్టి సముద్రం ఒడ్డున కూర్చొంటే నీకు జ్ఞానమును ఇవ్వడు. నీ లోపల అజ్ఞానము ఉందా, లేదా అని నీ లోపల ఉన్న స్థితిని చూసి భగవంతుడు నీకు జ్ఞానమును ప్రసాదిస్తాడు.

మనలను మనం ప్రేమించుకొంటాము. ఇతరులను విమర్శిస్తూ ఉంటాము. ఇది మనలో ఉన్న చెడ్డ. భగవంతుడిని తొందరగా చేరుకోవాలి అంటే ఒక పని చేయాలి. ఇతరులను ప్రేమిస్తూ మనలను మనం విమర్శించుకోవాలి. ఇలా చేస్తే భగవంతునికి దగ్గరవుతాము. ఇతరులను శోధించటం కాదు. నీ మనస్సును శోధించు. నీ మనస్సును శోధిస్తూ శోధిస్తూ దాని మూలం లోనికి వెళితే ఇప్పుడు మనస్సు నీకు నేనుగా ఎలా వ్యక్తమవుతోందో మనో మూలంలోనికి వెళ్ళినప్పుడు ఆమూలంలో ఉన్న పరమేశ్వరుడే నీకు నేనుగా వ్యక్తమవుతాడు. మోక్షం అంటే శరీరం చనిపోయిన తరువాత వస్తుంది అనుకొంటున్నారు. శరీరం చనిపోయిన తరువాత ఏదీ రాదు. శరీరం ఇక్కడే బూడిద అవుతుంది. జీవుడు వాడి వాసనలను బట్టి వెళ్ళిపోతాడు. మీకు మోక్షం రాదు. సమయం యొక్క విలువ తెలుసుకోండి. చావుకు సెలవలు లేవు. చావు మిమ్మల్ని వెంటాడుతూ ఉంటుంది. సమయం వచ్చినప్పుడు ముక్కులో గాలిని పరమేశ్వరుడు తీసి వేస్తాడు. భగవంతుడు రెండు శక్తులు ఇచ్చాడు. (1) ప్రాణం (2) మనస్సు. ప్రాణ శక్తివలన శరీరం తిరుగుతుంది. మనం ఆలోచించుకోవటానికి మనస్సు ఇచ్చాడు. ఈ భూమి మీద ఉండగానే ఈ రెండు శక్తులను ఎవడైతే సద్వినియోగం చేసుకొన్నాడో వాడు మాత్రమే భగవంతుని స్వరూపమును పొందుతాడు.

భగవంతుడు కానిదానిని మనం ప్రేమించుకొంటూ వెళితే ఈనాటికైనా, ముందు నాటికైనా ఏజన్మలో అయినా ఆప్రేమను ఉపసంహరించుకొని, ఉపసంహరించుకొని దేవుని దగ్గరకు వస్తేగాని మనకి మోక్షం రాదు. ఈ ఒక్క విషయం బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మనకు ఇష్టమైన పనిని చేయటంలో గొప్పలేదు. ఒక మంచి పనిని అది మనకు ఇష్టం లేకపోయినా ఇష్టం చేసుకొని ఆపని చేయటంలోనే నీ ఔన్నత్యం, సభ్యత ఉంది. ఎవరో ఏదో సాధన చేస్తున్నారు అని అది నీవు చేయవద్దు. నీలో ఉన్న బలహీనతలు చూసుకొని అందులోనుండి బయటకు రావటానికి ఏరకమైన సాధన చేయాలో అది చెయ్యి. నీ మనస్సు ఎలా అయితే ముగ్గుతుందో అలాగ సాధన చెయ్యి. అనుకరణ వద్దు. ప్రయాణం ఎలా చెయ్యాలో ముందే నిర్ణయించుకొని చెయ్యి. విగ్రహారాధన చెయ్యాలంటే చెయ్యి. పూర్ణ విశ్వాసంతో చెయ్యి, హృదయపూర్వకంగా చెయ్యి. అప్పుడు నీ మనస్సు సున్నితం అవుతుంది. నీ మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, పవిత్రత వస్తుంది. ఏకాగ్రత, పవిత్రత సంపాదించటమే నిజమైన సాధన. ఇవి కాకుండా నీవు ఏమిసాధించినా స్వప్నంలో కనబడే వస్తువులు ఎంతనిజమో అవి కూడా అంతే నిజం. నీవు ఏపని చేస్తున్నావు అన్నది ముఖ్యంకాదు. దాని వలన నీ మనస్సుకు ఎంత వరకు ఏకాగ్రత వచ్చింది, ఎంతవరకు పవిత్రత వచ్చింది, భగవంతుడిని తెలుసుకోవటానికి ఎంతవరకు అది సహాయపడుతోంది అనేది ముఖ్యం. మనస్సు ఏమి చేస్తుంది అంటే తనను విచారణలో పెడతారు అని భయపడి వారు అడ్డు వస్తున్నారు, వీరు అడ్డు వస్తున్నారు అని చెపుతుంది. దొంగ ఎత్తులు వేస్తుంది. దానిగొడవలోనికి రానివ్వదు. మన మనస్సే మనకు అడ్డు వస్తోంది.

ఏ వస్తువులో అయితే స్వేచ్ఛ ఉందో ఆ వస్తువు నీకు నేనుగా వ్యక్తమయ్యే వరకు నీకు స్వేచ్ఛలేదు. కొంతమంది శారీరకంగా ఏమీ చేయరు, మనస్సులో అన్నీ మోస్తూఉంటారు. ఎవరివి వారికి ఇచ్చివేసాము, ఇంక రిటైర్ అయిపోయాము అని చెపుతూ ఆగొడవలనే మనస్సులో మోస్తూ ఉంటారు. అది స్వేచ్ఛకాదు. అది ఎప్పటికైనా నిన్ను బంధిస్తుంది. కృష్ణుడు ఏమి చెప్పాడు అంటే ఇంద్రియములకంటే మనస్సు గొప్పది, మనస్సు కంటే బుద్ధి గొప్పది, బుద్ధికంటే పరమాత్మ గొప్పది. నీ దృష్టిని అక్కడే కేంద్రీకరించు అని చెప్పాడు. దానిని పొందు. దేనిని పొందితే నీకు స్వేచ్ఛ కలుగుతుందో దానిని పొందటానికి ప్రయత్నించు. దానిమీదే నీ దృష్టిని పెట్టు. ఈ జన్మలో దానిని పొందలేవు అనుకో దానికోసం మరణించు. రాబోయే జన్మలో అయినా సాధన చేసి దానిని పొందుతావు ఇప్పుడు నీవు చేసినది ఎక్కడికి పోదు నీకూడానే వస్తుంది.

Ratna Printing Works, Palakol. ✆ 22946